క్లుప్తంగా

అభివృద్ధిని విమర్శిస్తే సహించేది లేదు



సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని విమర్శిస్తే సహించేది లేదని మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ ఉప్పాడలో పర్యటించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను విమర్శించడంపై శుక్రవారం ఉప్పాడలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఉప్పాడ గ్రామాన్ని దత్తత తీసుకుని ఐదేళ్ల పాటు చేసిన అభివృద్ధి ఎక్కడని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీరు అందని శివారు ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలకు సచివాలయ సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉంటూ అనేక ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే సీసీ డ్రైనేజీలు, రోడ్లు నిర్మించామన్నారు.

పాత వారికే చేపలు పట్టే అవకాశం



సంఘాల నాయకులతో చర్చిస్తున్న అధికారులు

పిఠాపురం: మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పాత సంఘం వారికే చేపలు పట్టే అవకాశం ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని అధికారులు తెలిపారు. ఇటీవల గొల్లప్రోలు మండలం చెందుర్తి పెద్ద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై శుక్రవారం గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో రెండు సంఘాల నాయకులతో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటేశ్వరరావు మాట్లాడుతు మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పాత సంఘం వారికే చేపలు పట్టుకునే అవకాశం ఇస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే కోర్టు ధిక్కరణ అవుతుందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. అయితే కొత్త సంఘం సభ్యులు మాట్లాడుతు దళితులకు అవకాశం లేకుండా పాత సంఘానికే అవకాశం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎస్సై వినయ్‌ప్రతాప్, మత్స్యశాఖాధికారి రామకృష్ణ, పాత, కొత్త సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ గుర్తింపు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని జగ్గమ్మ గారిపేటలో అనధికార లేఅవుట్‌ను గుర్తించామని మున్సిపల్ కమిషనర్ జె. రామారావు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజేషన్ ఆఫ్ అనాథరైజ్డ్ లేఅవుట్ రూల్స్ 2020 అనుసరించి అనధికార లేఅవుట్‌ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఆన్‌లైన్ లేదా మున్సిపల్ కార్యాలయంలో 15 రోజుల లోపుగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. అనధికార లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు జరిగే వాటికి ప్లాన్స్ మంజూరు చేయరని కమిషనర్ హెచ్చరించారు. స్థలాలు కొనుగోలు చేసే కొనుగోలుదారులు ఇబ్బందులు పడతారన్నారు. సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు అనధికార లేఅవుట్‌ల వివరాలు నోటీసు బోర్డులో ఉంచారు.

వరుస చోరీలతో చిరు వ్యాపారుల బెంబేలు

సామర్లకోట: పట్టణ పరిధిలో వరుస చోరీలతో చిరు వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రథం సెంటర్ వద్ద ఒక చెప్పుల షాపులలో దొంగతనం జరిగింది. దానిలో సుమారు రూ.80 వేల మేరకు నష్టం జరిగినట్టు షాపు యజమాని ఫిర్యాదు చేశారు. ఆ సంఘటన జరిగి 48 గంటలు గడువక ముందే గురువారం రాత్రి రథం సెంటర్ వద్ద మెడికల్ షాపులో దొంగతనం చోటు చేసుకుంది. మెడికల్ షాపులో రూ.ఐదు వేలు నగదు చోరీకి గురి అయినట్టు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు షాపును పరిశీలించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. వ్యాపారస్తులు షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కె.దుర్గాప్రసాద్ సూచించారు.

రీసర్వే వేగవంతం చేయండి

- ఆర్డీఓ సత్యనారాయణ

పిఠాపురం: రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆయన శుక్రవారం పిఠాపురం తహసీల్దారు కార్యాలయంలో రీసర్వేపై అధికారులతో సమీక్షించారు. మండలంలో మిగిలి ఉన్న గ్రామాల్లో రీసర్వే త్వరగా పూర్తి చేసి, రైతులకు పాస్ బుక్‌లు అందించాలన్నారు. సర్వేపై వచ్చే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే రికార్డులు పరిశీలించారు. తహసీల్దారు త్రినాథరావు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్

పిఠాపురం: ఒలింపిక్ డే సందర్భంగా శుక్రవారం పిఠాపురంలో రన్ నిర్వహించారు. బాదం మాధవరావు బాలికల ఉన్నత పాఠశాలలో ఒలింపిక్ డే కన్వీనర్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొనగా ఈ రన్ సాగింది.

సచివాలయాలు.. సేవా నిలయాలు

- ఇంటి వద్దకే అన్నిరకాల సేవలు
- జగనన్న నిర్ణయం సాహసోపేతం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొత్తపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే ఆలోచనలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఇక ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో గ్రామ సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి.

మండలంలో లబ్ధిదారుల వివరాలు

పింఛన్ లబ్ధిదారులు-	12,537 మంది
అందించే లబ్ధి	రూ. 3.38 కోట్లు
నేతన్న నేస్తం లబ్ధిదారులు	542 మంది
వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు	14,189 మంది
మొదటి విడతలో మంజూరైన ఇళ్లు	2,402
మత్స్యకార భరోసా లబ్ధిదారుల సంఖ్య	5,620
కల్యాణమస్తు లబ్ధిదారులు	66 మంది
ఈబీసీ నేస్తం లబ్ధిదారులు	1,398 మంది

మండలంలో 25 గ్రామ సచివాలయాలు

కొత్తపల్లి మండలంలోని 25 సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. నవరత్న పథకాల్లో భాగంగా జగనన్న అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, మత్స్యకార భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలను సచివాలయాల ద్వారా అందిస్తున్నారు.

ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు. కానీ జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకే పాలన అందిస్తోంది. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు ప్రజలు జేజేలు కొడుతున్నారు.

స్వగ్రామంలోనే సేవలు

గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవతర్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు, భూమలు రీ సర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటి స్థలాలు లాంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగే వాళ్లమని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రా మంలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రమణక్కపేట గ్రామ సచివాలయం

మండలంలో సచివాలయాలు ఇలా..

కొత్తపల్లి మండలంలో 25 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఉప్పాడలో 4, అమీనాబాదులో 2, కొమరగిరిలో 2, కొండెవరంలో 2, నాగులాపల్లిలో 2, పొన్నాడలో 2, ఎండపల్లిలో 2, శ్రీరాంపురం, కొత్తమూలపేట, మూలపేట, అమరవల్లి, కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, గోర్స, పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లి, రమణక్కపేట గ్రామల్లో ఒక్కొక్కటి చొప్పున సచివాలయాలు ఉన్నాయి.

ఇంటికే పింఛను



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. గంటల కొద్దీ లైనులో ఉన్నాక రేపో మాపో ఇస్తామనేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ సమస్య లేదు. జగన్ బాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచడమే కాకుండా ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ ద్వారా ఇంటికే పింఛను అందిస్తున్నారు.

– రావిశెట్టి కొర్లమ్మ, వృద్ధాప్య పింఛను లబ్ధిదారు, ఉప్పాడ

గతంలో నష్టపోయాం



ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం కూడా చేనేత కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులు అన్ని విధాలా నష్టపోయారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేతన్న నేస్తం పేరుతో సంవత్సరానికి రూ.24 వేలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. గ్రామంలోనే అన్ని రకాల సేవలూ అందుతున్నాయి.

– ఇనుమర్తి భగవాన్, చేనేత కార్మికుడు, ఉప్పాడ వీవర్స్ కాలనీ

సచివాలయాల్లోనే ధ్రువీకరణ పత్రాలు



గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగవలసి వచ్చేది. ఇపుడు ఆ పరిస్థితి లేదు. మా సొంత ఊరిలోనే గ్రామ సచివాలయాల్లో వాటిని పొందుతున్నాం. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా నాలాంటి వారికి శ్రమ లేకుండా సేవలు అందుతున్నాయి.

– సూరాడ రమణమ్మ, ఉప్పాడ

ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ : ఆర్డీఓ

పిఠాపురం: పిఠాపురం ఉప్పాడ రైల్వే గేటు వద్ద నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ చేపట్టినట్లు ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆరు ఎకరాల భూమి అవసరమన్నారు. దీని కోసం ఇప్పటికే అవసరమైన భూమిని గుర్తించామని తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట ఆర్‌అండ్‌బీ డీఈ ఆశ్రిత, తహసీల్దారు త్రినాథరావు, సర్వేయర్ సత్యనారాయణ, రైల్వే అధికారులు ఉన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లించండి

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పన్నుల బకాయిదారులు ఈ నెల 30లోపుగా చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులను ఇంటి యజమానులు ఆయా వార్డుల సచివాలయాలలోను, మున్సిపల్ కార్యాలయంలోను చెల్లించవచ్చునన్నారు. మొదటి అర్ధ సంవత్సరానికి పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. జూలై ఒకటి నుంచి బకాయిలకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఒక వ్యక్తి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం చేబ్రోలుకు చెందిన చేదులూరి సూరిబాబు (62) రెండు రోజుల క్రితం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి ప్రమాదావశాత్తు కింద పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలవ్వడంతో స్థానికంగా చికిత్స చేయించారు. ఎంతకు తగ్గక పోవడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా శుక్రవారం చికిత్స పొందుతు మృతి చెందాడు. ఆయన భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు.

ప్రజలు మెచ్చేలా సంక్షేమ పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'కు అనూహ్య స్పందన



ఓ గృహిణి సమస్యలు వింటున్న దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రజలందరూ మెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. ×గడపగడపకూ మన ప్రభుత్వం౯ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దాపురం మండలంలోని ఆనూరు గ్రామంలో సర్పంచ్ నూకతాటి అనితారాణి, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామిల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సింగన శివ, నాగబోయిన రాజుబాబులతో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు గ్రామంలోని గడపగడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడపగడపకూ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంతో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పేద,బడుగు,బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందజేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ×గడపగడపకు మన ప్రభుత్వం౯ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మహిళాభ్యున్నతి, రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నటు చెప్పారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, కామన రామకృష్ణ, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మకు కుంభం

- ఆలయం మూసివేతతో బయట నుంచే భక్తులకు దర్శనం



ఆలయంలో అమ్మవారికి వేసిన కుంభం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఈఓ సీహెచ్ రామ్మోహనరావు, వేద పండితులు చిట్టెం హరిగోపాల శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంభం వేశారు. దీంతో అమ్మవారి ఆలయ ముఖ ద్వారాలు మూసివేశారు. అమ్మవారి దర్శనం కలుగకపోవడంతో ఆలయానికి వచ్చిన భక్తులు బయట నుంచి ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తిని దర్శించుకున్నారు. 24వ తేదీ ఉదయం ఆలయం సంప్రోక్షణ అనంతరం యథావిధిగా ఆలయ తలుపులు తీసి అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు ఈఓ రామ్మోహననరావు తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- జగ్గయ్య చెరువులో గడప గడపకూ



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: సీఎం జగన్ ఏ పథకం ప్రవేశపెట్టినా అది కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. జగ్గయ్య చెరువు కాలనీ 11వ వార్డు సచివాలయ పరిధి 20, 21వ వార్డుల్లో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామంలో పర్యటించి ప్రతి ఇంట్లో వారిని పలకరించి వారికి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతు టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు ఇస్తున్న పథకాలు రద్దు చేస్తామంటున్నారని అంటే టీడీపీ వారికి ప్రజల చెంతకు పాలన వెళ్లడం ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తు సంక్షేమ పథకాలను అమలు చేస్తు సంక్షేమమే ధ్యేయంగా పాలిస్తున్నారన్నారు. ప్రజల చెంతకే పాలనను తీసుకురావడం కోసమే గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను అమలుచేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్య చెరువు కాలనీలో మౌలిక వసతులు కల్పించే పనిలో భాగంగా రూ.26 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి



సచివాలయ కార్యదర్శులు, బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సామర్లకోట: ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో సచివాలయ కార్యదర్శులు, బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని నూతన ఓటరుగా చేర్చాలన్నారు. అదే క్రమంలో కలెక్టరు ఆదేశాల మేరకు ఒకే డోర్ నంబరులో ఎక్కువ మంది ఓటర్లు ఉన్న సమయంలో ఆయా ఓటర్లపై దృష్టి సారించవలసి ఉంటుందని చెప్పారు. ప్రతీ ఇంటిలోని ఓటరు ఆధార్ కార్డును పరిశీలించి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం అయ్యే విధంగా చూడాలన్నారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను, వీఆర్వోలను బీఎల్‌ఓలుగా నియమించామన్నారు. బీఎల్‌ఓలు సర్వేకు వెళ్లిన సమయంలో ఇళ్లలో లేని వారి వివరాలను సేకరించి ఇల్లు మారితే అక్కడకు ఓటు మార్పు చేసుకునే విధంగా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, రెవెన్యూ అధికారి పూడి రవిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకంతో రైతులకు మేలు

- నవరలో మినీ ట్రాక్టర్లు, ఇళ్ల పట్టాల పంపిణీ
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి



రైతులకు మినీ ట్రాక్టర్లను పంపిణీ చేసిన దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ యంత్ర సేవా పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నవర గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో మినీ ట్రాక్టర్ల పంపిణీ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ రైతులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి వారికి 40 శాతం సబ్సిడీపై వ్యవసాయానికి అవసరమైన యంత్రాలను అందజేస్తామన్నారు. రైతులు ఈ యంత్రాలను వారి వారి పొలాల్లో ఉపయోగించడంతో పాటు ఇతర రైతులకు అద్దెలకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. బ్యాంకులకు సకాలంలో వాయిదాలు చెల్లించి యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓటీఎస్ పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అదే విధంగా గ్రామంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎంపీటీసీ సభ్యులు కేశవరపు ప్రభాకరరావు, నాగనబోయిన చంటిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నిడదవోలు సురేష్‌చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిశెట్టి నరేష్, దొరబాబు, నాగనబోయిన రాజబాబు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీరు



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంను పరిశీలించిన ద్వివేది

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను విజయవాడ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరు జీకే ద్వివేది శుక్రవారం తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో సామర్లకోట వచ్చిన ఆయనకు సామర్లకోట స్టేషన్ మేనేజరు ఎం. రమేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే ప్లాట్‌ఫాం, రైల్వే ట్రాక్, సిగ్నల్ పాయింట్స్, ఎలక్ట్రికల్ పాయింట్స్‌ను పరిశీలించారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు, నారాయణరాజు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కిషోర్, జూనియర్ ఇంజినీరు సౌమ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులతో మమేకం కావాలి

- ఎస్పీ సతీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కొత్తపల్లి: ప్రజలు పోలీసులతో మమేకం కావాలని, పోలీసులనే భయాన్ని వీడి ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని అమీనాబాదు గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయం వద్ద శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాలు, మహిళా భద్రత, పోలీసు విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. సర్పంచి నక్కా మణికంఠబాబు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకు ఈ వారధి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల పార్టీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ కార్యదర్శి రావు చిన్నారావు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రతి ఇంటికీ వెళ్లి ఏ సమస్య ఉన్నా పరిష్కరించే వినూత్న కార్యక్రమమే జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మున్సిపల్ కార్యాలయంలో ఆయన పాల్గొన్నారు. కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు పేదలకు అందించాలనన్నదే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం అన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు రెండు బృందాలుగా విడిపోయి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరి వారి అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్న సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుడా వీసీ సుబ్బారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, తహసీల్దారు త్రినాథ్, మున్సిపల్ కమిషనర్ టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి, ఎంపీడీఓ చిన్నారావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

పెద్దాపురం: వచ్చే నెల నుంచి ప్రతీ వార్డులో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రారంభోత్సంలో భాగంగా శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కార్యాలయం నుంచి సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమం అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. లబ్ధి పొందని వారిని గుర్తించి ప్రతీ ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సాయి ప్రసాద్ కోరారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్, , కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు.

ఇంటింటికీ లబ్ధి..

కొత్తపల్లి: ప్రభుత్వం నుంచి ఏ లబ్ధీ పొందని వారిని గుర్తించి సంక్షేమ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్షపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది వలంటీర్లు కృషి చేయాలన్నారు. సచివాలయాల్లో అమలు చేస్తున్న సేవలను మరింత ప్రచారం చేయాలన్నారు. ఈ పథకంలో కులం, ఆదాయం, జనన, మరణ, వివాహ, పట్టాదారు పాసు పుస్తకాలు నమోదు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ నమోదు వంటి సేవలను ఉచితంగా అందిస్తారని చెప్పారు. తహసీల్దారు ప్రసాద్, ఈఓ పీఆర్డీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాయింట్స్‌మాన్ సేవలు అభినందనీయం

సామర్లకోట: రైల్వేలో పాయింట్స్‌మాన్‌ల సేవలు కీలకమని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో పాయింట్స్ మాన్‌గా పని చేసి తుని రైల్వే స్టేషన్‌కు బదిలీ అయన జి. భాస్కరరావుకు శుక్రవారం స్టేషన్ మేనేజరు ఆధ్వర్యంలో వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు రిలీఫ్ మెమో అందజేశారు. పాయింట్స్‌మాన్ సేవలను పలువురు కొనియాడారు.

పాల వెల్లువపై అవగాహన

కొత్తపల్లి: జగనన్న పాల వెల్లువ పథకంతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పశుసంవర్ధక అధికారి శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని వాకతిప్ప, ఎండపల్లి, కొండెవరం గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

సామర్లకోట: రైల్వేలో ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి అన్నారు. శుక్రవారం స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అధ్యక్షతన ఆపరేటింగ్, సిగ్నల్ డిపార్టుమెంట్ల సిబ్బందితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు. విపత్కర పరిస్థితులు ఎదురైన సమయంలో ఏవిధంగా స్పందించాలో ఆయన వివరించారు. స్టేషన్ సూపరింటెండెంట్లు శ్రీధర్, అనంతలక్ష్మి, జూనియర్ ఇంజినీరు సౌమ్య తదితరులు పాల్గొన్నారు.